క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


వేతనదారులతో మాట్లాడుతున్న దృశ్యం

రణస్థలం: జె.ఆర్.పురం పెద్ద చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ఎం.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో ఆయన మాట్లాడుతూ.. రోజుకు కనీసం ఆరు గంటలకు తక్కువ కాకుండా పని చేస్తే రూ. 250 నుంచి 272 రూపాయల వరకూ వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ గడ్డయ్య ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


జి.సిగడాం: గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యులు

జి.సిగడాం: జాడ, నడిమివలస గ్రామ సచివాలయాల్లో బాతువ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రతిష్ట శర్మ ఆధ్వర్యంలో 104 వాహనంలో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో దోమలు ఎక్కువగా ఉంటాయని.. వీటి నుంచి రక్షణకు దోమతెరలు వాడాలని సూచించారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో 104 వాహనాల వైద్యాధికారి యశోద, ఎం.ఎల్.ఎస్.పి కావ్య, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమాజఠలేశ్వరుడు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి నారికేళ జలంతో అభిషేకాలు నిర్వహించారు. స్వామిని రకరకాల పూలతో అలంకరించారు. భక్తులు స్వామి దర్శించుకొని పూజలు చేశారు.

పాఠశాల కిటికీ అద్దాల ధ్వంసం

ఎల్.ఎన్.పేట: మండలంలోని యంబరాం ప్రాథమికోన్నత పాఠశాల మేడపై ఉన్న తరగతి గది కిటికీ అద్దాలు గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారని ఎంఈఓ-2 కె చంద్రమౌళి తెలిపారు. శనివారం పాఠశాల పనివేళలు ముగిసిన తరువాత సాయంత్రం తలుపులు వేసుకుని ఉపాధ్యాయులు వెళ్లి పోయారన్నారు. సోమవారం పాఠశాల తెరిచి చూసే సరికి కిటికీ అద్దాలు పగలగొట్టి ఉన్నట్లు గుర్తించిన హెచ్ఎం ఇచ్చిన సమాచారం మేరకు పాఠశాలను పరిశీలించామని తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ అద్దాలు పగలగొట్టినట్లు అనుమానిస్తున్నామన్నారు. అదే గదిలో విలువైన టీవీ, ఇతర పరికరాలు ఉన్నాయని, ఆ వస్తువులకు ఎంటువంటి నష్టం జరగలేదన్నారు. కిటికీ అద్దాలు మాత్రమే పగలగొట్టి వెళ్లిపోయారని వివరించారు.

మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదే..

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- ఫరీదుపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


వర్షంలోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో సంక్షేమ, ప్రజాపాలన అందిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఫరీదుపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. రేషన్ కార్డు వారీగా లబ్ధిదారులకు అందజేసిన ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలు పక్షాన నిలబడి సంక్షేమాన్ని చేరువ చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సంక్షేమం లబ్ధిదారుల ఇళ్లకే చేరుతున్నాయన్నారు. స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వలంటీర్ వ్యవస్థపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, వ్యవసాయ అధికారి సురేష్, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, పీఆర్‌ఏఈ సూర్యచంద్ర, ఉపాధి హామీ పథకం ఏపీఎం శోభాదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, స్థానిక సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, నాయకులు మెట్ట దాలినాయుడు, సత్తారు గోపి, మొదలవలస కృష్ణారావు, సీపాన వెంకటరావు, పైడి వాసుదేవరావు, బోర సాయిరాం, సీరపు శ్రీరాంమూర్తి, కోన సూర్యారావు పాల్గొన్నారు.

జోరు వానలోనూ..

జోరు వానలోనూ ఫరీదుపేటలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని కొనసాగించారు. వర్షంలో తడుస్తూనే ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరించారు.

హెడ్ కానిస్టేబుల్ కుమార్తెకు ఎస్పీ ప్రశంసలు


ఎస్పీ జి.ఆర్.రాధిక నుంచి జ్ఞాపిక అందుకుంటున్న చాతుర్య లాస్య

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ దూడల పార్వతీశం కుమార్తె చాతుర్య లాస్య పదో తరగతిలో 600 మార్కులకు 582 తెచ్చుకుంది. దీంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ బీఆర్ రాధిక విద్యార్థిని చాతుర్య లాస్యను అభినందించారు. ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు నగదు చెక్కును బహూకరించారు. ఉన్నత చదువు చదివి తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, బాలిక తండ్రి పార్వతీశం పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు


బహుమతులతో విద్యార్థులు, నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పొన్నాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నైతిక ప్రవర్తన పెంపొందించే కథల పోటీలను సోమవారం నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో మొదటి మూడు స్థానాలు గోవిందరాజులు, రేష్మ, సంధ్య, జూనియర్ విభాగంలో భువన, శశిధర్, హేమంత్ నిలిచారు. నిర్వాహకులు విష్ణు, భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రోగ్రామ్ ఆర్గనైజర్ లలితమణి పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

రణస్థలం: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ రణస్థలం పీవో సీహెచ్ ఝాన్సీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొండములగాం అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ), దేరసాం-1 అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ-డీ), అర్జునవలస కేంద్ర సహాకురాలు (ఓసీ) పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిసి..ఆసక్తి, టెన్త్ విద్యాఅర్హత కలిగిన మహిళ అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక సంఘం నిధులు ఇవ్వాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామాల అభివృద్ధికి 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా కేటాయించిన నిధులను వెనక్కి ఇవ్వాలని శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ కోరారు. ఈ మేరకు జెడ్పీ ఆవరణలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షుడు ఆనెపు రామకష్ణంనాయుడు, జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు పిన్నింటి భానోజీరావు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు వినతి పత్రం అందజేశారు.

వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం

పోలాకి: మండలంలోని గుప్పెడుపేట గ్రామంలో మత్స్యకారుల ఉపాధి లక్ష్యంగా నెలకొల్పనున్న సీఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్‌కు సభ్యుల వెరిఫికేషన్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఎంసీఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ డివిఎస్‌ఆర్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 965 మందికి 863 మందిని గుర్తించారు. వీరి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. పోలాకి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన సాగరమత్స్యకారులు వేట చేసిన పీతలు, రొయ్యలు, ఇతర సీఫుడ్‌ను ఇక్కడే ప్రోసెసింగ్ చేసి ఎగుమతులు చేపట్టే అవకాశం లభించిందని స్థానిక మత్స్యకారసంఘ నాయకుడు, రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య అన్నారు. సర్పంచ్ పైడితాత పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నరసన్నపేట సీఐ


ఎస్పీ జి.ఆర్.రాధికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్: సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం డీసీఆర్‌బీ నుంచి నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బదిలీ అయిన బూర ప్రసాదరావు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలను ఆయనకు ఎస్పీ చేశారు. సీఐ ప్రసాదరావు 2006లో ఎస్ఐగా సంతకవిటిలో విధుల్లో చేరి.. సంతబొమ్మాళి, టెక్కలిలో పనిచేశారు. ప్రమోషన్‌లో భాగంగా విశాఖపట్నం మహిళా పీఎస్‌లో 2014లో సీఐగా బాధ్యలు తీసుకున్నారు. అనంతరం శ్రీకాకుళం ఇంటెలిజెన్స్‌లో రెండున్నరేళ్లు, 2019లో ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్, ఆమదాలవలసలో పనిచేసిన ఆయన చివర్లో డీసీఆర్బీలో చేరారు. తాజా బదిలీల్లో నరసన్నపేకు వెళ్లారు. అడిషనల్ ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామిలను కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

బెల్లం వంటకాలతో ఆరోగ్యానికి మేలు


బెల్లంతో తయారు చేసిన పదార్థాలను పరిశీలిస్తున్న దృశ్యం

లావేరు: బెల్లంతో తయారు చేసే వంటకాలు తింటే ఆరోగ్యానికి మేలని లావేరు-2 ఎంఈవో మజ్జి మురళీకృష్ణారావు అన్నారు. మెట్టవలస గ్రామంలోని హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు రేగిడి జ్యోత్స్న ఆధ్వర్యంలో ఆరో తరగతి విద్యార్థులతో బెల్లం, వరి పిండి, రాగి పిండి, సజ్జలు, బియ్యం వంటి పదార్థాలతో తయారు చేయించిన సంప్రదాయ వంటకాలను సోమవారం ప్రదర్శించారు. వీటిని పరిశీలించిన మురళీకృష్ణారావు బాగా తయారు చేశారని అభినందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు చిరంజీవి, దుర్గ, మణికంఠ, జశ్వంత్, దేవచరణ్‌లకు బహుమతులు అందజేశారు. హైస్కూల్ హెచ్‌ఎం వి.సత్యనారాయణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం రమణమూర్తి, ఉపాధ్యాయులు వెంకటరావు, సూర్యారావు, శ్రీధర్, మల్లేషు, హిమబిందు, నాయుడు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నవంబర్‌లో కోదండరాముని కల్యాణోత్సవం


రామతీర్థాలు అర్చకులతో చర్చిస్తున్న నారాయణ తిరుమల అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని కోదండరాముని కల్యాణ వేడుకలను నవంబర్ నెలలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థంలోని కోదండరాముని ఉత్సమూర్తులను తీసుకువచ్చి కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏర్పాట్లలో భాగంగా ఆదివారం రామతీర్థాలులు కోదండరామాలయానికి వేంకటరామానుజ సేవాదళం సభ్యులు వెళ్లి అక్కడి అర్చకులతో చర్చించామన్నారు. నవంబరు నెలలో మూహూర్తం నిర్ణయించి కల్యాణ వేడుకలు జరిపేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ


పరామర్శలో నాయకులు, అధికారులు

లావేరు: మురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డు హెచ్‌ఎం తేనేల మంగయ్యనాయుడు ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు సోమవారం పరామర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, రణస్థలం మండల ఏఈ డి.రామారావు, తాళ్లవలస ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముప్పిడి సురేష్, తామాడ మాజీ సర్పంచ్ రౌతు శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొర, మురపాక సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన


సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ప్రజల ముంగిటకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పిషిణి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎటువంటి ధ్రువీకరణ ప్రతం కావాలన్నా క్షణాల్లో గ్రామ సచివాలయాల ద్వారా అందించేందుకు నిర్వహిస్తున్న బృహత్తరమైన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. 11 సేవలు సత్వరమే అందించేందుకు గ్రామ సచివాలయాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి అర్హతలను పరిశీలించి రేషన్ కార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్లా వెంకటరెడ్డి, రాయపురెడ్డి భుజంగరావు, గొర్లె అప్పలనాయుడు, పిషిణి సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, గ్రామ నాయకులు పతివాడ సత్యం, శ్రీరాములు, బొంతు జగన్నాథం తదితరులు ఉన్నారు.

దైవ చింతనతో సమాజంలో ప్రశాంతత

ఆమదాలవలస: ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. తొలిత స్వామివారిని స్పీకర్ దంపతులు దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్‌గా సాకా శ్రీధర్, సభ్యులుగా శిల్లా ప్రశాంతలక్ష్మి, ముంగంటి శ్రీనివాసరావు, బలివాడ సంతోషిరూప, పి.ఆర్.సుధారాణి, ఆర్.అరప్ప, ఐ.అనంతరావు, జామి రమేష్‌ను నియమించారు. ఆలయ ఈఓ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని కులాలు, మతాలను సమానంగా చూస్తున్నారన్నారు. ఆలయ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కూడా అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆమదాలవలస పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. దేవదాయ శాఖ అధికారుల విలువైన సూచనలతో ఆలయం విశిష్టతను కాపాడాలన్నారు. ఆమదాలవలస పట్టణంలో గల పాలపోలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తున్నట్లు స్పీకర్ చెప్పారు.

గ్రంథాలయ పితామహుడు 'అయ్యంకి'కి ఘన నివాళి


ఎచ్చెర్ల క్యాంపస్: అయ్యంకి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

లావేరు: గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణయ్య ఎంతో పాటుపడ్డారని లావేరు, మురపాక శాఖా గ్రంథాలయాధికారులు మురపాక శ్రీనివాసరావు, తలే రాంబాబు అన్నారు. గ్రంథాలయ పితామహుడు వెంకటరమణయ్య జయంతి కార్యక్రమాన్ని ఆయా గ్రంథాలయాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు అయ్యంకి జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. 1907వ సంవత్సరంలో అయ్యంకి ప్రజారంగంలో ప్రవేశించి గ్రంథాలయోద్యమం, సహకారోద్యమం, వయోజన విద్య వంటి ఉద్యమాలను నడిపారని గుర్తు చేశారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖరరావు అయ్యంకి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రోత్సహించారన్నారు.

రణస్థలం: బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించిన గ్రంథాలన్నింటినీ రహస్యంగా దాచి ప్రజలకు అందజేసిన ఘనత అయ్యంకి వెంకటరమణయ్యకే దక్కిందని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. అయ్యంకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయాల అభ్యున్నతికి ఆయన చేసిన ఉద్యమాన్ని గుర్తు చేశారు. చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన కె.రాంబాబు, కె.శివ, యు.లక్ష్మణరావులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ పాపినాయుడు ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్: అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ.. గ్రంథాలయ ఉద్యమ నాయకుడు, గ్రంథాలయ పితామహుడు వెంకటరమణయ్య అని అన్నారు. ప్రజలలో చైతన్యం నింపాలంటే సమాజానికి సంబంధించిన సమగ్ర సమాచారం వారికి తెలియాలన్నారు. ఆ సమాచారం వారికి చేరవేయాలంటే పత్రికలు, గ్రంథాలయాలు సులభమైన మార్గం అని పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి చేసిన వ్యక్తి వెంకటరమణ కొనియాడారు. అందుకే ఈయనను 'గ్రంథాలయ పితామహుడు'అని అంటారని చెప్పారు. 'గ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయం 'అని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి అని, ఆయన జీవితం అంతా గ్రంథాలయ ఉద్యమానికే ధారపోశారన్నారు. తొలుత వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, కె.చిరంజీవులు, పి.వరలక్ష్మి, యు.కల్యాణి, గణేష్ పాల్గొన్నారు.

- బలగ హడ్కోకాలనీలోని శాఖా గ్రంథాలయానికి ఆంధ్ర లయోలా కాలేజ్ రిటైర్డ్ బోటనీ ప్రొఫెసర్ డాక్టర్ నిక్కు అప్పన్న సాహితీ పుస్తకాలైన భావ తరంగిణి, వ్యాస మంజరి పుస్తకాలను గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేనకు అందజేశారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సహాయకరాలు కె.అనిత ఉన్నారు.


శ్రీకాకుళం అర్బన్: సాహిత్య పుస్తకాలను అందజేస్తున్న అప్పన్న


రణస్థలం: వెంకటరమణయ్యకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు


లావేరు: మురపాకలో వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తూ..


శ్రీకాకుళం అర్బన్: వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం